తవ్వారు.. వదిలేశారు

నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఇంకుడు గుంతలు

అమీర్‌పేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల క్రితం భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవిలో బోర్లు వేసినా చుక్క నీరు రాని పరిస్థితి. ఈ నేపథ్యంలో అధికారులు ఇంకుడు గుంతలకు శ్రీకారం చుట్టారు. వీటి ద్వారా వాన నీటిని ఒడిసి పట్టుకోవాలని, తద్వారా భూగర్భ జలాలను వృద్ధి చేసుకునే దిశగా కార్యాచరణ రూపొందించుకొని ముందడుగు వేశారు. యుద్ధప్రాతిపదికన వరుసగా ఇంకుడు గుంతలు నిర్మించారు. ప్రయోజనాలు కనిపించినప్పటికీ నిర్వహణను గాలికొదిలేశారు. లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన ఇంకుడు గుంతలు మాయమయ్యాయి. ఖైరతాబాద్ సర్కిల్-17లోని అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో 110 ఇంకుడు గుంతలను నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో చివరి రెండు సంవత్సరాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ ఆ పై పట్టించుకోకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగమైంది.

రెండేళ్లు.. వందకు పైగా ఇంకుడు గుంతలు

అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌ల పరిధిలో పది సంవత్సరాల క్రితం భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. అప్పట్లో వేసవిలో ప్రత్యేక కార్యాచరణలో భాగంగా బోర్లు వేసేవారు. ఇందుకోసం రూ.లక్షలు వెచ్చించి డ్రిల్లింగ్ చేసి పవర్ బోర్లను స్థానికులకు అందుబాటులోకి తీసుకొచ్చేవారు. కానీ, ఎక్కడ బోర్లు వేసినా అప్పట్లో చుక్క నీరు వచ్చేదికాదు. వెయ్యి ఫీట్లకు మించి డ్రిల్లింగ్ చేసినా ఫలితం లేకపోవడంతో నిధులు వృథా చేయడం ఇష్టం లేక బోర్లు వేయడమే మానేశారు. ఆ తర్వాత భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు ఇంకుడు గుంతల నినాదంతో అధికారులు ముందుకొచ్చారు. కాలనీల అసోసియేషన్ సభ్యులను భాగస్వాములను చేస్తూ నిధులు కేటాయించి వర్షపు నీరు ఎక్కువగా ప్రవహించే ప్రాంతాలు, పార్కుల చెంత, రోడ్ల పక్కన, అవకాశం ఉన్న ప్రతీచోట గుంతలు తవ్వారు. వరుసగా వర్షాకాలానికి ముందు రెండేళ్ల రెండు డివిజన్‌ల పరిధిలో వందకు పైగా ఇంకుడు గుంతలను తవ్వించారు. వీటివల్ల కాలనీల్లో నెమ్మదిగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. దీనిని ఆదర్శంగా తీసుకున్న జలమండలి అధికారులు సైతం ఇక్కడ 50కి పైగా ఇంకుడు గుంతలు తవ్వించారు. వీరి ఆధ్వర్యంలో నిర్మించిన గుంతలు వంద శాతం మాయమయ్యాయి.

విచ్చలవిడిగా బోర్లు..

ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచే భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో తీవ్ర నీటి కొరత ఏర్పడింది. అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, బాపూనగర్, ఎస్‌ఆర్టీ, లీలానగర్, బల్కంపేటలో హాస్టళ్లు ఎక్కువగా ఉన్నాయి. నీటి కొరత వల్ల విచ్చలవిడిగా బోర్లు వేసినా చుక్క నీరు రాని దుస్థితి. దీంతో ప్రైవేట్ ట్యాంకర్లను తెప్పించుకున్నారు.



చాణక్య నగర్‌లో ఆనవాళ్లు లేకుండా పోయిన ఇంకుడు గుంత

కనుమరుగు..

అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌లలో తవ్వించిన వందకు పైగా గుంతల్లో ప్రస్తుతం ఒక్కటి కూడా కనిపించడం లేదు. తవ్విన తర్వాత వరుసగా రెండేళ్లపాటు నిర్వహణను పర్యవేక్షించారు. తర్వాత వాటిని గాలికొదిలేయడంతో కొన్ని అధ్వానంగానూ, మరికొన్ని అపరిశుభ్రంగానూ మారగా, ఇంకొన్ని ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఈ గుంతల్లో చేరిన పూడికను తీసేవారు లేక నీరు ఇంకక.. గుంతల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్లుగా పూడుకుపోతూ, ప్రస్తుతానికి మొత్తం కనుమరుగయ్యాయి. వాటికి సాక్ష్యంగా ఆయా ఇంకుడు గుంతల వద్ద ఏర్పాటు చేసిన వాటర్ హార్వెస్టింగ్ బోర్డులు మాత్రమే ఉన్నాయి. కనీసం బోర్డులు ఉన్న చోట్ల పూడుకుపోయిన గుంతలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలి



కాంక్రీట్ జంగిల్‌గా మారిన అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను వెంటనే పునరుద్ధరించాలి. అడుగంటిన భూగర్భ జలాలను వృద్ధిలోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మొదటి రెండు సంవత్సరాలు నిర్వహణ సక్రమంగానే ఉన్నప్పటికీ ఆ పైన గాలికొదిలేశారు. దీంతో వేల రూపాయలు వెచ్చించి తవ్వించిన ఇంకుడు గుంతలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. వెంటనే వీటిని పునరుద్ధరించాలి.

● నోముల శివశంకర్, రేణుకనగర్ ఈస్ట్

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు



ప్రతీ వర్షం బొట్టును ఒడిసి పట్టి భూమిలో ఇంకించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు గత ప్రభుత్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. లక్షలు వెచ్చించి తవ్వించిన ఇంకుడు గుంతల్లో చెత్తాచెదారం చేరి అసలు వాటి ఆనవాళ్లు లేకుండా పోయాయి. సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నప్పటికీ భూమిలోకి చుక్క నీరు ఇంకక వృథాగా మురుగునీటి నాలాల్లో కలిసి పోతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇంకుడు గుంతలను పునరుద్ధరించాలి

● సర్దార్ సురేందర్ సింగ్, చాణక్యనగర్

సత్యసాయిలో జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన



ఉత్పత్తులతో లైఫ్ కోచ్ శ్రీలక్ష్మీరెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన - 2025ను సోషలైట్, లైఫ్ కోచ్ శ్రీలక్ష్మీరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని తెలిపారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. నిర్వాహకుడు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 74 వేల రకాల వస్త్రో త్పత్తులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.



ఖైరతాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న కుమార్ యాదవ్, తదితరులు

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

అక్రమ నిర్మాణం సీజ్

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధి కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు ఎదురుగా ఉన్న ఈడబ్ల్యూఎస్ 1076లో ఉన్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు సీజ్ చేశారు. సదరు నిర్మాణంపై ఫిర్యాదులు రావడంతో గురువారం మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రెండోసారి సీజ్ చేశారు. గతంలో హెచ్చరించి సీజ్ చేసినా మళ్లీ సీల్ తొలగించి పనులు చేయడంపై ఏసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు నిర్మాణాలు చేసుకోవాలని ఆయన సూచించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

బంజారాహిల్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఒడిస్సాకు చెందిన ఓ మహిళకు పది సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టాక భార్యభర్తలు విడిపోయారు. దీంతో మహిళ పిల్లలను తీసుకొని నగరానికి వచ్చి సోమాజిగూడలో నివాసం ఉంటోంది. ఈ తరుణంలో అశ్వక్‌తో పరిచయం ఏర్పడింది. అశ్వక్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.9లోని ఓ గదిలో సహజీవనం మొదలు పెట్టాడు. కాగా, పెళ్లి చేసుకొమని కోరగా కొద్ది రోజులుగా ముఖం చాటేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వెంగళరావునగర్ ఏ-టైప్ పార్కుకు వెళ్లే మార్గంలో వారం రోజులుగా పేరుకుపోయిన వ్యర్థాలు

- వెంగళరావునగర్, ఆంధ్రజ్యోతి

పాఠశాలకు వెళ్లే రహదారిలో గుంతలు

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



మాదాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గం

హైటెక్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ ప్రధాన రహదారి కి కూతవేటు దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిలో గంతలు పడ్డాయి. వర్షం కారణంగా ఆయా గుంతల్లో నీరు చేరింది. దీంతో విద్యార్థులు నడిచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని, చెత్తను తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్తాచెదారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మురళీకృష్ణ

పోలీస్ శాఖ ఏర్పాట్లు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పంజాగుట్ట ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం వెస్ట్ శ్రీనివాసనగర్ కమ్యూనిటీ హాల్‌లో మధురానగర్ పీఎస్ పరిధిలోని గణేశ్ మండప నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ పలు సూచనలు చేశారు. సమావేశంలో సీఐ ప్రభాకర్, ఎస్‌ఐలు సాయి కుమార్‌గౌడ్, సుష్మ, నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గణేశ్ మండపాల నిర్వాహకులు

గణేశ్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో వేర్వేరుగా వినాయక మండపాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. పోలీసులు ఇచ్చే సూచనలను, సలహాలను పాటిస్తూ వేడుకలను ఘనంగా పూర్తి చేయాలన్నారు. అనుమతించిన మేర లౌడ్ స్పీకర్లను వాడాలన్నారు. మండపాల వద్దకు వచ్చే భక్తుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఇష్టం ఉన్నట్టు మసులుకున్నా క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండపాలు పెట్టే ప్రతి ఒక్కరూ పోలీసు అనుమతి తీసుకోవడంతో పాటు నిమజ్జనం తేదీని కూడా ముందే తెలియజేయాలన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్

నిబంధనలు పాటించాలి

పంజాగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శోభన్ అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో గణేశ్ మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌ఐలు వెంకటకిషన్, నరేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓట్ల దొంగలు గద్దె దిగాలి

ఖైరతాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఓట్లు చోరీ చేసిన కేంద్ర ప్రభుత్వం గద్దె దిగిపోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఖైరతాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కార్పొరేటర్ విజయారెడ్డి, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



సనత్‌నగర్ డివిజన్‌లో జాతీయ పతాకాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేత వెల్లాల రామ్మోహన్, సుబ్బారావు, అనురాధ, కుసుమ, రాంప్రసాద్, రవిచంద్ర, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు

● బేగంపేట, ఆంధ్రజ్యోతి



తనిఖీ అధికారిగా విధుల్లో చేరిన కె.నందకుమార్‌ను తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఖైరతాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ జిల్లాలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీసీ రెడ్డి, నక్క యాదగిరి, మహేందర్, సభ్యులు పాల్గొన్నారు

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి


ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన న్యూక్లబ్ నూతన కమిటీ సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన న్యూక్లబ్ నూతన కమిటీ

సికింద్రాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని న్యూక్లబ్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులు గురువారం కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, పాలక వర్గ సభ్యులు తరుణ్, ప్రియాంక, రాజశేఖర్, విజయ్‌మోహన్, సాయికిరణ్, సుజయ్ కుమార్, భాస్కర్‌లు పాల్గొన్నారు.



మెక్లోడ్‌గూడలో కార్పొరేటర్ పర్యటన

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం మెక్లోడ్‌గూడలోని లోతట్టు ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వ్యర్థాలను తొలగించాలని పారిశుధ్య అధికారులు, హైడ్రా మాన్‌సూన్ సిబ్బందిని ఆదేశించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, డివిజన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నాయకులు కోమల్ శర్మ, సాయి, ప్రశాంత్ పాల్గొన్నారు. **- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి**

మహాకాళి అమ్మవారికి పూజలు



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మాజీ అదనపు డీసీపీ రాంచందర్ సతీసమేతంగా గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి పూజలు జరిపారు.
- సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి

నేడు 2300 ఫీట్ల జాతీయ ఫ్లాగ్ ర్యాలీ

అడ్డగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అడ్డగుట్టలోని తిరంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ 12వ సంవత్సరం 2300 ఫీట్లతో జాతీయ ఫ్లాగ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రతి ఏటా ఒక ఫీటు పెంచుతూ 12 ఏళ్లుగా జాతీయ జెండా ర్యాలీని అడ్డగుట్ట నుంచి ఈస్ట్‌మారేడుపల్లి, తుకారాంగేట్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు.

ఉద్యమకారుల బోర్డును ఏర్పాటు చేయాలి

అడ్డగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే సీఎం అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం చైర్మన్ ఎస్.యాదగిరి అన్నారు. గురువారం తుకారాంగేట్‌లోని ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల ఆకాంక్షలు అమలు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సెప్టెంబరు 12న ధర్నా చేపట్టాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆత్మ బలిదానం చేసుకున్న ఉద్యమకారుల కుటుంబాలకు గుర్తింపు కార్డులు, 250 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాధవి, వైస్ చైర్మన్ పద్మ, యాదగిరి, బాబన్న, రాజేంద్రప్రసాద్, యాదగిరి, మల్లేష్, శారద, లక్ష్మన్న, రాజయ్య నర్సిరెడ్డి, చంద్రకళ, యాదగిరిలు పాల్గొన్నారు.

హోంగార్డు ఆఫీసర్లకు సన్మానం

రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్ రోడ్డుపై పడిపోగా హోంగార్డు ఆఫీసర్లు గుర్తించి దానిపై నుంచి వాహనాలు వెళ్లకుండా అప్రమత్తమై అతడికి అప్పగించినట్లు నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు ఆఫీసర్లు కరీముల్లాబైగ్, తిరుపతయ్యలను ఆయన శాలువలతో సన్మానించారు. ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్సైలు సతీష్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.


హోంగార్డు ఆఫీసర్లను సన్మానిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ దొంగిలించిన దొంగలను పన్నెండు గంటల వ్యవధిలో రాంగోపాల్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి 12.30 గంటల సమయంలో రసూల్‌పురాకు చెందిన స్వర్ణకారుడు సికింద్రాబాద్‌లో విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళుతుండగా సర్దార్ పటేల్‌రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు నిందితులు అతడి నుంచి సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడు వెంటనే రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు వెంగళరావునగర్‌లోని కల్లు దుకాణంలో ఉన్నారని తెలుసుకుని వారిని అరెస్ట్ చేసి వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని, దొంగిలించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బీఎన్ఎస్ 112 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.


నిందితులు శంకర్ పవార్, కాలే శివ

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంటీఎస్ రైలులో చనిపోయి ఉన్న ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని రైల్వేపోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న ఎంఎంటీఎస్ రైలులో గుర్తుతెలియని 60 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండగా రైలు మేనేజర్ గుర్తించి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


వృద్ధుడి మృతదేహం

వ్యక్తి అదృశ్యం

బౌద్ధనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడ కిందిబస్తీకి చెందిన మహ్మద్ సత్తార్(25)కు రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. బేగంపేటలో సీటు కవర్లు కుట్టే పని చేస్తున్నాడు. 12వ తేదీన ఉదయం 11:30కు పనికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి చేరుకోకపోవటంతో భార్య భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. షాపు యజమానికి ఫోన్ చేయగా పనికి రాలేదని చెప్పాడు. సత్తార్ కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని బుధవారం రాత్రి భార్య షబా ఆఫ్రీన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మహ్మద్ సత్తార్(ఫైల్)


మహాత్మానగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న భానుక మల్లిఖార్జున్



రెజిమెంటల్‌బజార్‌లో తిరంగా ర్యాలీ

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

జాతీయ జెండా చిహ్నం కాదు సమష్టి గర్వం

బోయినపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారత జాతీయ జెండా ఒక చిహ్నం మాత్రమే కాదు, మన సమిష్టి గర్వమని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు బానుక మల్లిఖార్జున్ అన్నారు. బీజేపీ పార్టీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంతో పాటు, గురువారం మహనీయుల విగ్రహాలను శుభ్రపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం కార్యక్రమం బోయినపల్లి కంటోన్మెంట్ ఆరవ వార్డులో మహాత్మనగర్‌లో వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక సభ్యుడు బానుక మల్లిఖార్జున్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహాత్మనగర్‌లోని డాక్టర్ బీ. ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి బస్తీవాసులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రతిక్ జైన్, బాణాల శ్రీనివాస రెడ్డి, రవీందర్ రెడ్డి, అజయ్ గౌడ్, అభిలాష్, స్వరూప, భారతి, నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్‌లో..

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. గురువారం హిల్‌స్ట్రీట్ ప్రభుత్వ పాఠశాల నుంచి క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహించి, క్లాక్‌టవర్ అమరవీరుల స్థూపం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక బీజేపీ సీనియర్ నాయకులు శంకర్, మన్మోహన్ సింగ్ ఠాగూర్, గురుద్వార అధ్యక్షులు జగన్‌మోహన్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకురాలు మేకల కీర్తి ఆధ్వర్యంలో గురువారం బౌద్ధనగర్ డివిజన్‌లో ఈశ్వరిబాయి నగర్, తదితర ప్రాంతాల్లో హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు జాతీయ జెండాలతో పలు వీధుల్లో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్షకిరణ్, సత్యనారాయణ, శ్యామ్, రాజ్‌కుమార్, యాదమ్మ, జ్యోత్స్న, ప్రమీల, సౌజన్య, అమీనాబేగం తదితరులు పాల్గొన్నారు.
- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి

విశాఖ బీచ్‌లో మహిళ మృతి

- **రక్షించే యత్నంలో యువకుడు గల్లంతు**
- **మరొకరిని కాపాడిన లైఫ్ గార్డులు**

బీచ్ రోడ్డు (విశాఖపట్నం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రామకృష్ణా బీచ్ సందర్శనకు వచ్చిన ఒక మహిళ సముద్రంలో మునిగి మృతి చెందగా, ఆమెను రక్షించే ప్రయత్నంలో ఒకరు గల్లంతయ్యారు. మరొకరు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ విమలాదేవి నగర్‌లోని మైత్రీ నివాస్‌లో నివాసముంటున్న టి.కోటేశ్వరరావు భార్య వసంత(58), బంధువు సాయికృష్ణ తదితరులతో కలిసి సింహాచలంలో ఓ పెళ్లికి వచ్చారు. అక్కడి నుంచి గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌కు వెళ్లారు. ప్రమాదకరమని తెలియక స్నానం చేసేందుకు సముద్రంలో దిగారు. అలలు ఉధృతంగా రావడంతో వసంత, సాయికృష్ణ లోపలకు కొట్టుకుపోయారు. కళ్లెదుటే మునిగిపోతున్న వారిని రక్షించేందుకు అక్కడే ఉన్న ఒడిశాకు చెందిన గోవింద్ (26) యత్నించి గల్లంతయ్యాడు. మునిగిపోతున్న సాయికృష్ణను లైఫ్‌గార్డులు రక్షించి క్షేమంగా తీరానికి చేర్చారు. అయితే అప్పటికే వసంత మృతి చెందింది. గల్లంతైన గోవింద్ పెందుర్తిలోని ఓ రొయ్యల కంపెనీలో పనిచేస్తున్నట్టు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన విద్యార్థుల శిక్షణా శిబిరం

బోయినపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజన బాల బాలికల్లో శారీరక, మానసిక, సామాజిక అవగాహనను పెంపొందిస్తూ సమానత దృక్పథాన్ని కలిగించడానికి హర్ వాయిస్ వాయిస్ ఫర్ బాయ్స్ పేరిట పది రోజుల పాటు నిర్వహించిన శిక్షణా శిబిరాలు గురువారం బోయినపల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ హైస్కూల్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు ఐటీడీఏ ప్లెయిన్ ఏరియా ప్రాజెక్ట్ ఆఫీసర్ సర్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా శిక్షణా శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరాలు వాయిస్ ఫర్ సంస్థ ఐటీడీఏ సంస్థల సహకారంతో ఉచిత శిక్షణ నిర్వహించిన వాయిస్ ఫర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాయిస్ ఫర్ హెడ్ కోఆర్డినేటర్ బాను సమీర్, ఏసీఎంఓ అశోక్, జీసీడీఓ సునిత, స్పోర్ట్స్ ఆఫీసర్ జ్యోతి, పాఠశాల ప్రిన్సిపాల్ బాణోతు లాలు, ఆముక్త మాల్యద, హెచ్‌డబ్ల్యూఓ రెబెక్కా, నీలిమ, ఎల్లమ్మ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ : కోట నీలిమ

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నుంచి చిరువ్యాపారులకు రక్షణగా గొడుగులను పంపిణీ చేస్తామని పీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయ సమీపంలో చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలోని తమవంతుగా చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే ప్రజల సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో నియోకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్, డీసీసీ కార్యదర్శి హేమంత్ సింగ్ ఠాకూర్, పంచముఖి హనుమాన్ దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బచ్చు రాజ్‌కుమార్, నాయకులు సురేష్, విను, యాసిన్, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.


గొడుగులు పంపిణీ చేస్తున్న కోట నీలిమ

జీపీఎం స్వామికి నివాళులు

బోయినపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల కోసం ఆహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడు జీపీఎం స్వామి అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. స్వామి 42వ వర్ధంతి పురస్కరించుకుని బోయినపల్లి ఒకటో వార్డు చిన్నతోకట్ట సంజీవయ్యనగర్‌లో ఆయన విగ్రహానికి జంపన ప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించేవారని, బస్తీ వాసులు ఆయన సేవలు గుర్తు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, డీఎం అశోక్‌కుమార్, యాదవ రావు, హరికృష్ణ, అచ్చయ్య, రవీందర్, వెంకటేష్, వరప్రసాద్, సాయిబాబా యాదవ్, బండి శ్రీనివాస్, కరణ్ సింగ్, టెంట్ రాజు, యాదగిరితో పాటు బస్తీవాసులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాలు

పద్మారావునగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగర మాజీ తొలి మేయర్ కృష్ణస్వామి ముదిరాజ్ 132వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు గావిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జి.దివాకర్ ముదిరాజ్ తెలిపారు. సికింద్రాబాద్, బోయిగూడలో ముదిరాజ్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శనివారం ఉదయం 11గంటలకు ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కాసినా జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్రమంత్రి వాకాటి శ్రీహరి, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.నాగేశ్వరరావు విచ్చేయనున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఉత్తమ క్రీడాకారులు, సామాజిక సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు దొడ్ల సదానంద్, శ్రీనివాస్, సురేందర్, శ్రీకాంత్, మన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రినగర్‌లో పాడైపోయిన చేతి పంపుకు మరమ్మతులు చేస్తున్న జలమండలి సిబ్బంది

పంపు పాడై రెండేళ్లు.. ఒక్క ఫోన్ కాల్‌తో మరమ్మతు

అడ్డగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్ శాస్త్రి నగర్ బస్తీలో రెండేళ్ల క్రితం పాడైపోయిన చేతి బోరింగ్ పంపుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. రుద్రవీణ మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ జలమండలి అధికారులకు ఫోన్ చేసి బోరింగ్‌కు మరమ్మతులు చేయాలని ఒత్తిడి చేయడంతో వెంటనే స్పందించిన మారేడుపల్లి జలమండలి అధికారులు రంగంలోకి దిగిన సిబ్బంది చేతి బోరింగ్ పంపుకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. శాస్త్రీనగర్ బస్తీవాసులు జలమండలి సిబ్బందితో పాటు శోభకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గౌరీశంకర్‌కు సతీ వియోగం

తిరుమలగిరి ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ప్యారసాని గౌరీశంకర్ సతీమణి కమలాదేవి బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వారి నివాసానికి వెళ్లి కమలాదేవి భౌతికకాయం వద్దపూల మాలలు ఉంచి నివాళులర్పించి, గౌరీ శంకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అలాగే బేవరెజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదాకేశవరెడ్డి, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, అల్వాల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జీవకన్, బోర్డు మాజీ సభ్యులు అనిత, పాండు యాదవ్, లోకనాథ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగసేని సరిత, మురళీ ముదిరాజ్, రేమండ్ హార్వుడ్, పెద్దల నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ వార్డు-7 ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్, కేటీ. శంకర్ రావు, కంటోన్మెంట్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ ప్రెసిడెంట్ భవానిలు కమలాదేవి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.


కమలాదేవి మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్


సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న తలసాని

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

సికింద్రాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారికి సకాలంలో సరైన వైద్యం అందించాలని సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్‌మారేడుపల్లిలోని కార్యాలయంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ సీసీనగర్‌కు చెందిన మల్లేష్ చికిత్స కోసం రూ.3.50లక్షలు, బేగంపేట్ డివిజన్ పాటిగడ్డకు చెందిన జమునకు గుండె సంబంధిత చికిత్స కోసం 80వేల రూపాయిల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, మహేష్‌యాదవ్, కుమార్‌యాదవ్, కిషోర్, ఆరీఫ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని, మండపాన్ని సుందరంగా అలకంరించగా, వేదపండితులు ధన్వంతరి హోమం, వేదపారాయణం చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో చప్పన్ భోగ్ (56 మిఠాయిల మహా నివేదన) సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ అతెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించగా దేవాలయ కమిటీ సభ్యులు వెంకట్ నారాయణ, కొప్పూరి వెంకటేష్ (రాజు) శివనారాయణ, శ్రీనివాస్ రావు, కొంకా కుమారస్వామిలు వారిని ఘనంగా సత్కరించారు.


మగ్గం పనులు ప్రారంభిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయక కమిషనర్ అన్నపూర్ణ

అమ్మవారికి చీరల తయారీ

రెజిమెంటల్‌బజార్,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా కుమ్మరిగూడ శ్రీపతి పండితారాధ్య రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి అలంకరణ నిమిత్తం పది చీరెలను మగ్గంపై తయారు చేయిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ, సహాయక కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఆలయంలో పోచంపల్లి చేనేత కార్మికులతో ప్రత్యేకంగా మగ్గం ఏర్పాటు చేసి చీరలు తయారీ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.ఎస్.కుమారి, లలితా పారాయణదారు, జనరల్ సెక్రటరీ రుక్మిణి, అదనపు సెక్రటరీ నీలిమ, ట్రెజరర్ అరుణ, ఉమ, జయంతి తదితరులు పాల్గొన్నారు.